క్లుప్తంగా

ఎన్‌బీకేఆర్‌కు ఐఎస్‌ఓ గుర్తింపు


సర్టిఫికెట్లు చూపుతున్న అధ్యాపకులు

కోట: విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలకు హెచ్ఐఎం అంతర్జాతీయ సంస్థ(ఐఎస్‌ఓ) గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కళాశాలలో మాట్లాడుతూ ఆ సంస్థ ప్రతినిధులు కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించి, అత్యున్నత విద్యాబోధన, ఉద్యోగావకాశాలు, గ్రీన్‌కారిడార్ తదితర వాటికి గుర్తింపునిస్తూ ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను అందజేశారన్నారు. ఈ మేరకు కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కళాశాల అధ్యాపకులు, సిబ్బందిని అభినందించినట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

సూళ్లూరుపేట రూరల్: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా మూడో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఎస్. మలికార్జున తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 4 నుంచి 5 గంటల వరకు 99592 25646 నంబర్‌లో అందుబాటులో ఉంటామన్నారు. సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకునిరావాలని సూచించారు. సూళ్లూరుపేట–కోట మార్గంలో నడిచే రెండు బస్సుల్లో గిఫ్ట్ స్కిమ్ నంబర్ ఈనెల ఒకటో తేదీ నుంచి ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

హెల్మెట్‌తో ప్రాణరక్షణ

కలువాయి: హెల్మెట్ వాడకంతో వాహనచోదకులకు ప్రాణరక్షణ కలుగుతుందని ఎస్ఐ మహేంద్ర అన్నారు. కలువాయిలో సోమ వారం హెల్మెట్ ధారణపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. నెల్లూరు సరయు హీరో ద్విచక్రవాహన షోరూం యాజమాన్యం సహకారంతో 50 మంది ద్విచక్ర వాహనచోదకులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు.

శాశ్వత భూహక్కు సీఎం జగనన్నతోనే సాధ్యం


భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరిరూరల్: రైతులకు శాశ్వత భూహక్కు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య పేర్కొన్నారు. పట్టణంలోని సుదర్శననగర్‌లో సచివాలయంలో సోమవారం రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పట్టాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వందేళ్ల తరువాత భూములు రీ సర్వే చేసి, భూ సమస్యలు పరిష్కరించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనని చెప్పారు.

ప్రజారోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి


గూడూరు రూరల్: కిట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



వెంకటగిరి రూరల్: వల్లివేడులో కిట్ ఇస్తున్న వైద్యులు, సైదాపురం: స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

గూడూరురూరల్: ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరులోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడారు. వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బత్తిని విజయకుమార్, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, బత్తిని విజయకుమార్, అన్వర్ బాషా పాల్గొన్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

వెంకటగిరిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని వల్లివేడులో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 72 మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. వైద్యులు శివకృష్ణారెడ్డి, రెడ్డిప్రసాద్, శ్రీతేజ, సహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

నాయుడుపేటటౌన్: జగనన్న ఆరోగ్య సురక్షలో అందిస్తున్న వైఎస్సార్ కంటి వెలుగు వైద్యసేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక కోరారు. తుమ్మూరు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి పైగా శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పీ చంద్రారెడ్డి, సీ వెంకటేశ్వర్లు, ఏ చంద్రారెడ్డి, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

కోటలో..

కోట: శ్యాంసుందరపురంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ నాగరాజు పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో సర్పంచ్ వెంకటరమణమ్మ, ఈఓపీఆర్డీ నయీమ్, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే లక్ష్యం

రాపూరు: పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ప్రజాప్రతినిధులు అన్నారు. రాపూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, సర్పంచ్ జయమ్మ, పార్టీ మండల కన్వీనర్ పీ దయాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీడీఓ అప్పాజీ, తహసీల్దార్ ప్రసాద్, వైద్యులు సూర్యధర్మేంద్ర, అంజలి, నర్మదాదేవి, రాజకుమారి పాల్గొన్నారు.

సురక్ష.. ఆరోగ్య రక్ష

దక్కిలి: జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యరక్షణ కలుగుతుందని ఎంపీపీ జీ రాజశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దగ్గవోలులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. డీటీ హరికృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం నారాయణరెడ్డి, కోలా మస్తాన్ నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ కోటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు వరం

సైదాపురం: జగనన్నఆరోగ్య సురక్ష పేదల వరమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మర్లపూడి ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రమణయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైద్యులు జనార్దన్, శ్రావణి, ఏఓ పురుషోత్తం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.




నాయుడుపేటటౌన్: హెల్త్‌కార్డు ఇస్తున్న చైర్‌పర్సన్ దీపిక, రాపూరు: కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ నర్మదాదేవి, దక్కిలి: హెల్త్ కార్డులు అందజేస్తున్న ఎంపీపీ

సమస్యల పరిష్కారానికి కృషి


స్పందనలో ఆర్డీఓకు అర్జీలు అందజేస్తున్న ప్రజలు

గూడూరురూరల్: స్పందన కార్యక్రమం ద్వారా ప్రతి సోమవారం గూడూరు డివిజన్‌లోని ప్రజలు అందజేసే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలు మండలాల ప్రజలు అర్జీలు అందజేశారు. భూ సమస్యలు పరిష్కరించాలని అధిక సంఖ్యలో అర్జీలు అందజేశారు. ఆయా మండలాల తహసీల్దార్లతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

తహసీల్దార్ ఘెరావ్

గూడూరు మండలంలోని వెందోడు గ్రామానికి చెందిన కమ్మరి కులస్తులు తమకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని, వెంటనే మంజూరు చేయాలంటూ తహసీల్దార్‌ను ఘెరావ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్ ఆందోళన చేస్తున్నవారిని కార్యాలయానికి పిలిచి మాట్లాడారు. కమ్మరి కులస్తులమైన తమకు గతంలో అధికారులు ఎస్టీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లను ఇచ్చి ఉన్నారని, ఇప్పుడు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

కండలేరులో 11.579 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 11.579 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

ఎంఈఓల మండిపాటు

పెళ్లకూరు: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్ నిర్వహణపై ఎంఈఓలు మండిపడ్డారు. ప్రభుత్వం పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించినప్పటికీ సోమవారం ఇక్కడ పాఠశాల నిర్వహించారు. దీంతో కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎంఈఓ శంకరయ్య పాఠశాల ప్రిన్సిపల్‌తో మాట్లాడినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కోట: గూడలి వద్ద సోమవారం టిప్పర్, ఆటోను ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ పుల్లారావు కథనం మేరకు.. గూడలికి చెందిన చంద్రయ్య హైరర్స్ సామగ్రిని ఆటోలో తీసుకుని వెళుతుండగా ఇసుక టిప్పర్ ఆటోను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో వెనుక కూర్చుని ఉన్న చంద్రయ్యకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆయన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జెండా మళ్లీ ఎగురవేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం(వెంకటగిరి): నిత్యం ప్రజల్లోనే ఉందాం .. కలిసికట్టుగా పనిచేద్దాం.. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పాలనను వివరిద్దాం.. మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జీఆర్ భవనంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంపై సోమవారం వెంకటగిరి మున్సిపాలిటీ, రూరల్ మండలాల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, గృహసారథులు, వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి మాట్లాడుతూ ఎన్నికలు కూడా మార్చి, ఏప్రిల్ నెలలో జరుగుతాయన్నారు. ఈ ఆరు నెలల్లో ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాల అమలుపై క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టే ప్రతి సంక్షేమ పథకం గురించి ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి వివరిద్దామన్నారు. ప్రతి పల్లెలో 80 శాతం మంది ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారన్నారు. నిత్యం ప్రజల కోసం శ్రమించే వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందన్నారు. ప్రతి సచివాలయంలో పార్టీ మండల కన్వీనర్లతోపాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులంతా కలిసి ఓరోజు సచివాలయంలో బస చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భానుప్రియ, పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, వైస్ చైర్మన్లు బాలయ్య, ఉమామహేశ్వరి, విప్ లక్ష్మి, నేతలు ఎల్ కోటేశ్వరరావు, సీ హరికృష్ణ, ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


దొరవారిసత్రం: సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

దొరవారిసత్రం: సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం నెలబల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. చెంగాళమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ డీ బాలచంద్రారెడ్డి, ఎంపీపీ సుజాతమ్మ, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రమేష్, సర్పంచ్ రజిని, నాయకులు సురేష్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, మునస్వామినాయుడు, పద్మనాభరెడ్డి, వెంకటాచలంరెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు


నాయుడుపేట టౌన్: అంబేడ్కర్ భవన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్: పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, కమిషనర్ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ జనార్దన్‌రెడ్డితో కలసి అంబేడ్కర్ భవన్ స్థితిగతులను ఎమ్మెల్యే పరిశీంచారు.

వైఎస్సార్‌సీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఏ బాబును సోమవారం పరామర్శించారు. బాబుకు ఆరోగ్యం సరిగా లేక చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు.

విద్యుత్ సమస్యలపై స్పందించండి


మాట్లాడుతున్న డైరెక్టర్ సుబ్బరాజు

నాయుడుపేటటౌన్: విద్యుత్ సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కారించేలా చర్యలు చేపట్టాలని ఏపీ ఎస్‌పీడీసీఎల్ తిరుపతి జోన్ డైరెక్టర్ ఎస్ సుబ్బరాజు సూచించారు. నాయుడుపేట విద్యుత్ డివిజన్ కార్యాలయంలో సోమవారం నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి విద్యుత్ సబ్ డివిజన్‌ల వారీగా అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా విద్యుత్ బిల్లులు వంద శాతం వసూలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే విద్యుత్ అక్రమ కనెక్షన్ల గుర్తించి వాటిని తొలగించడంతో పాటు వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో నాయుడుపేట ఈఈ ప్రసన్న కుమార్, సబ్ డివిజన్ల డీఈలు ఆర్ శేఖర్, ఖాదర్‌బాషా, మునిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై మెరుపు దాడులు

- 9 యంత్రాల స్వాధీనం

గూడూరురూరల్: మండలంలోని వెడిచెర్ల, రెడ్డిగుంట ప్రాంతాల్లో తెల్లరాయి(క్వార్జ్)ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం రాత్రి గూడూరు ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి మెరుపు దాడులు చేశారు. ఈ దాడుల్లో 9 యంత్రాలు(హిటాచిలు) స్వాధీనం చేసుకుని, గూడూరు రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నిత్యం ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా తెల్లరాయి, గ్రావెల్ తరలిస్తున్న వారిపై నిఘా ఉంచామని, ఈ విషయమై ప్రభుత్వానికి కూడా సమాచారం ఇచ్చామన్నారు. అలాగే చిల్లకూరు మండలం బూదనం సమీపంలో ఓ జేసీబీని కూడా స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌లో అప్పగించామన్నారు.

జేసీబీ పట్టివేత


సైదాపురం: అడవిలో అక్రమ ఖనిజ సంపద కోసం తవ్వకాలు సాగిస్తున్న జేసీబీ, టిప్పరును సోమవారం నెల్లూరు అటవీ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా నెల్లూరు రేంజర్ మాల్యాద్రి మాట్లాడుతూ పోతేగుంట అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టగా అక్కడ అక్రమంగా మైనింగ్ తవ్వుతున్న ఓ జేసీబీతోపాటు టిప్పర్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న జేసీబీని గ్రామస్తుల సమక్షంలో సీజ్ చేశామనితెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అమీనయ్య, రవిశేఖర్, విజయ్‌కుమార్, గిరిజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

గరుడవాహనంపై లక్ష్మీనరసింహుడు


గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి సోమవారం సాయంత్రం గరుడవాహనంపై విహరించారు. ఉదయం స్వామివారు చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి అభిషేకం, చందన అలంకరణ, నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, కల్యాణం జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం బంగారు గరుడ వాహనంపై ఉత్సవమూర్తిని కొలువు తీర్చి మాఢవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


దక్కిలి: ప్రతిజ్ఞ చేస్తున్న ఐకేపీ సిబ్బంది

దక్కిలి (బాలాయపల్లె): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఏపీఎం శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం క్రాంతిపథం కార్యాలయంలో బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఉపాధి ఏపీఓ మృత్యుంజయరావు పాల్గొన్నారు.

18 ఏళ్ల నిండాకే వివాహం

దక్కిలి: 18 ఏళ్లు నిండిన తరువాతే ఆడపిల్లలకు వివాహాలు చేయాలని ఏపీఎం పోలమ్మ అన్నారు. క్రాంతిపథం కార్యాలయంలో సోమవారం బాల్య వివాహాల నిరోధక చట్టం కింద సమావేశం నిర్వహించారు. సీసీలు రమేష్, సునీలా, రాజేశ్వరి, సంఘబంధం అధ్యక్షురాలు సౌజన్య పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

సైదాపురం: బాల వివాహాల నిర్మూలనపై పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు సైదాపురం ఏపీఎం రాధ పేర్కొన్నారు. సైదాపురంలో మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం బాల్య వివాహాలను నిర్మూలించేందుకు వీఓఏలతో సమీక్షించారు.

అవగాహన అవసరం

వెంకటగిరిరూరల్: బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఏపీఎం జమునారాణి తెలిపారు. పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో సోమవారం బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

ఓజిలి: గ్రామాల్లో బాల్య వివాహాలు నిర్మూలించేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండల వెలుగు కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. ఏపీఎం నిర్మలమ్మ, ఈఓపీఆర్డీ మోహన్, ఎంఈఓ చంద్రశేఖర్, సీహెచ్ఓ సుబ్బరామయ్య, సీసీలు శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పలు అనర్థాలు

చిట్టమూరు: బాల్య వివాహాలతో పలు అనర్థాలు చోటు చేసుకుంటాయని ఎంపీడీఓ షాలెట్ అన్నారు. చిట్టమూరులో బాల్య వివాహవ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గాయత్రీదేవి అలంకారంలో చెంగాళమ్మ


సూళ్లూరుపేట రూరల్: గాయత్రీదేవిగా చెంగాళమ్మ



నాయుడుపేటటౌన్: ఖడ్గమాల కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు, నాయుడుపేటటౌన్: కన్యకా పరమేశ్వరి దేవికి పూజలు చేస్తున్న భక్తులు







చిల్లకూరు: అన్నపూర్ణదేవ్మి, చిట్టమూరు: బాలా త్రిపుర సుందరి, చిల్లకూరు: గాయత్రీదేవి , దక్కిలి: బాలత్రిపుర సుందరిదేవి, సైదాపురం: మహాలక్ష్మి గాయత్రీ





గూడూరురూరల్: అన్నపూర్ణాదేవిగా కన్యకా పరమేశ్వరి,రాపూరు: ఆదిలక్ష్మీదేవి అలంకరణలో ఆదిలక్ష్మీదేవి, బాలాతిపుర సుందరిగా అంకమ్మ, బాలాత్రిపుర సుందరిగా కన్యకాపరమేశ్వరి

సూళ్లూరుపేట రూరల్: చెంగాళమ్మ ఆలయంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో చండీయాగం నిర్వహించారు. పట్టణ వాసులు అమ్మవారికి మేళ తాళాల నడుమ సారెను సమర్పించారు.

అన్నపూర్ణదేవిగా ముత్యాలమ్మ

చిల్లకూరు: తూర్పుకనుమూరులోని ముత్యాలమ్మ ఆలయంలో జరిగే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి గూడూరు ఏఎంసీ మాజీ చైర్మన్ జానకిరామిరెడ్డి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

విశేషాలంకరణల్లో అమ్మవార్లు

నాయుడుపేటటౌన్: మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం అమ్మవార్లకు విశేషాలంకరణలు చేశారు. పట్టణంలోని పోలేరమ్మ, ముకాంబికాదేవి అమ్మవార్లకు బాలత్రిపురదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పోలేరమ్మ ఆలయంలో భక్తులు శ్రీదేవి ఖడ్గమాల కుంకుమార్చన పూజలు చేశారు. దుర్గమల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి గాయత్రీదేవి అలంకరణ చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరికి మహాలక్ష్మి అలంకారం చేశారు.

బాలాత్రిపుర సుందరిగా కామాక్షమ్మ

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో కామాక్షమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు కామాక్షమ్మ బాలా త్రిపురసుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నాయుడుపేటకు చెందిన నిరంజన్, లక్ష్మి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

గాయత్రీదేవిగా ఆదిలక్ష్మీదేవి

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మి అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో సామూహిక కుంకుమార్చన సేవ జరిపారు. నెల్లూరుకు చెందిన పల్లంరెడ్డి రఘురామిరెడ్డి వనమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

బాలత్రిపురసుందరిగా పార్వతీదేవి

దక్కిలి: మండలంలోని స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలోని పార్వతీదేవి బాలత్రిపుర సుందరిదేవిగాభక్తులకు దర్శనమిచ్చారు.

మహాలక్ష్మిగా త్రిపురసుందరి

సైదాపురం: మండల కేంద్రంలోని బాలత్రిపురసుందరీదేవి అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమించారు. ఆలయంలో నవగ్రహ శాంతి, గణేష్ హోమం నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో..

వెంకటగిరిరూరల్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లు సోమవారం ప్రత్యేక అలంకరణలో కొలువుదీరారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోని కాత్యాయనీదేవి అమ్మవారు గాయత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వెలమపాళెంలోని మందనాచారమ్మ ఆలయంలో అమ్మవారు, కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

విశేషాలంకారాల్లో అమ్మవార్లు

గూడూరురూరల్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు విశేషాలంకరణలు చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, రాజరాజేశ్వరి అమ్మవారు, విజయేశ్వరిదేవి, నారాయణమ్మ పేరంటాళ్లు అమ్మవార్లు బాలాత్రిపుర సుందరిగా, అలంకారంలో దర్శనమిచ్చారు.

ఆదిలక్ష్మీదేవి అలంకరణలో ఆదిలక్ష్మీదేవి

రాపూరు: పెంచలకోనలోని ఆదిలక్ష్మీదేవి అమ్మవారు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆదిలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి పాలు, తెనే, పెరుగు, నెయ్యి, చందనం, పసుపు, కుంకుమ, నారికేళ జలంతో స్నపన తిరుమంజనం చేశారు. అలాగే రాపూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు, మండలంలోని వేపినాపిలోని అంకమ్మ బాలత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.